క్లుప్తంగా...

నేడు మంత్రి పర్యటన

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలంలో శనివారం మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సైదోనిగడ్డ తండాలో నిర్వహించే గిరిజన దినోత్సవంలో ఆయన పాల్గొంటారని తెలిపారు.

నాగారం.. బెస్ట్ రెవెన్యూ మున్సిపల్ అవార్డు



కీసర: పట్టణ ప్రగతి దినోత్సవంలో భాగంగా నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో నాగారం పురపాలక సంఘానికి బెస్ట్ రెవెన్యూ మున్సిపల్ అవార్డు లభించింది. మంత్రి కేటీఆర్ చేతులమీదుగా అవార్డును మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి అందుకున్నారు. కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నిర్మాణాలను నిలిపివేయాలని ఫిర్యాదు

ఘట్‌కేసర్: పట్టణంలోని శివాజీగూడ శ్రీనిధి నెస్ట్ సర్వే నంబర్లు- 505, 506, 557, 570, 571, 576/బి, 575/1-2లో నిర్మాణాలను నిలిపివేయాలని మున్సిపల్ కమిషన వేమనరెడ్డికి స్థానికుడు రాంరెడ్డి శుక్రవారం ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో 36 మీటర్లతో రోడ్డు ఉందని, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ ప్లాన్‌ను పాటించకుండా చేపడుతున్న నిర్మాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరానికి స్పందన



మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో ఎన్‌ఎస్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని గ్రామ నాయకులు ప్రారంభించగా అనంతరం గ్రామస్తులు 80 యూనిట్స్ రక్తాన్ని అక్షయ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుమార్‌యాదవ్, ఉపసర్పంచ్ గణేశ్, వార్డు సభ్యులు, నాయకులు రామకృష్ణుడు, రమేశ్, రామకృష్ణ, ఎన్‌ఎస్‌జీ ఫౌండేషన్ సభ్యులు నిఖిల్, సత్య తదితరులు పాల్గొన్నారు.

తూనికలు కొలతలపై అవగాహన



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారి సత్యనారాయణ

ఘట్‌కేసర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బైపాస్ రోడ్డులోని మైసమ్మగుట్ట వద్ద గల హెచ్‌పీసీఎల్ ఎంజీ పెట్రోల్ బంక్‌లో శుక్రవారం తూనికలు, కొలతలు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న వారికి తూనికలు, కొలతల జిల్లా అధికారి పల్నాటి సత్యనారాయణ పెట్రోల్ పంపుల్లో జరుగుతున్న మోసాల వివరాలతో పాటు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో డీలర్ జీవన్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మట్టయ్య, సందీప్‌రెడ్డి, రాజావర్ధన్‌రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

కూలర్ల కంపెనీలో అగ్నిప్రమాదం

ఘట్‌కేసర్: బొక్కనిగూడలో కూలర్లు, మిద్దె తోటల టబ్బుల తయారీ కేంద్రంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. కంపెనీ యజమాని తాళం వేసి మరో ఊరికి వెళ్లాడు. షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలు ఆర్పారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.



దారితప్పుతున్న సుందరీకరణ



నిలిచిపోయిన చెరువు సుందరీకరణ పనులు



సబ్‌స్టేషన్‌కు పొంచిఉన్న వరద ముప్పు..

- చెన్నాపురం చెరువు అభివృద్ధికి రూ.2 కోట్లు
- నిధులు ఉన్నా అసంపూర్తిగానే పనులు
- అలుగు దారి మళ్లింపునకు యత్నాలు
- సబ్‌స్టేషన్‌కు పొంచి ఉన్న ముప్పు

జవహర్‌నగర్: చెన్నాపురం చెరువు సుందరీకరణకు ప్రభుత్వం రూ.2 కోట్లను మంజూరు చేసింది. గతేడాది వర్షాకాలానికి ముందు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను నిలిపివేయడంతో అర్ధాంతరంగా చెరువు సుందరీకరణ పనులు నిలిచిపోయాయి. ఈ సంవత్సరం వర్షాకాలం సమీపిస్తున్నా సుందరీకరణ పనులు పూర్తి చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పట్టణం నడిబొడ్డున సుందరమైన వాతావరణం ఉంటుందని భావించిన మంత్రి కేటీఆర్ గతంలో ఇక్కడ పర్యటించి రూ.2 కోట్లు ప్రకటించారు.

సాగుతున్న పనులు..

గత వర్షాకాలానికి ముందు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ వర్షాలు పడి చెరువు నిండటంతో అప్పుడే పనులను నిలిపివేశాడు. గతంలోనే కాకతీయ మిషన్ నిధులతో రూ.కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం ఏమాత్రం పనులు చేయకుండా మధ్యలోనే పనులను నిలిపివేసి నిధులను ఖాళీ చేశారు. తాజాగా సుందరీకణ పేరుతో మళ్లీ రూ.2 కోట్లు మంజూరు చేసినా తూతూ మంత్రంగా పనులు కొనసాగిస్తూ నాసిరకంగా పనులు చేపడుతున్నారు. ఇప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు రూ.50 లక్షలను అధికారులు అందజేశారు.

వరదనీటి దారి మళ్లింపు యత్నాలు..

చెరువు సుందరీకణ పేరుతో స్థానిక నాయకులు వరద నీరు(అలుగు నీరు)ను దారిమళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. చెరువు నిండిన తర్వాత అలుగు మీదుగా వెళ్లే నీరు సబ్‌స్టేషన్ వెనుక భాగం నుంచి వరద నీరు వెళ్తుంది. వరద నీరు వెళ్లే స్థలాన్ని కొందరు స్థానికులు కబ్జా చేయడంతో వారి స్థలాల్లో వరద నీరు వెళ్లకుండా అలుగు నీరు మార్కెట్ పక్కన ఉన్న రోడ్డు మార్గంలో నేరుగా ప్రధాన రహదారికి చేరేవిధంగా చేస్తామని కొందరు స్థానిక నాయకులు కబ్జాదారులతో కుమ్మక్కైనట్లు సమాచారం.

సబ్‌స్టేషన్‌కు పొంచిఉన్న వరద ముప్పు..

సుందరీకరణ చేపట్టిన కాంట్రాక్టర్ అలుగు నీరును బయటకు వెళ్లే మార్గాన్ని సరిచేయాల్సి ఉంది. చెరువు నిండిన సమయంలో అలుగుపారే నీరు సబ్‌స్టేషన్ వెనుకభాగం నుంచి బయటకు వెళ్లేది. కానీ ఆ నీటిని దారి మళ్లిస్తే సబ్‌స్టేషన్ లోపలికి నీరు వెళ్లే ప్రమాదం ఉంది.

ఆత్మహత్యలు.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

చెన్నాపురం చెరువులో ఇప్పటి వరకు దాదాపు వందల మంది పడి మృత్యువాతపడగా ఎంతో మంది ఆత్మహత్య చేసుకున్నారు. కొందరు చెరువు మత్తడి వద్ద మద్యం సీసాలు అక్కడే వదిలేసి వెళ్తున్నారని, ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడులకు దిగి నగలు ఎత్తుకెళ్తున్నారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మినీట్యాంక్ బండ్ నిర్మాణాన్ని పూర్తిచేసి చెరువు కట్ట చుట్టూ సీసీరోడ్డు, లైటింగ్ సదుపాయం, గ్రీనరీ, మత్తడి నిర్మాణం, గార్డెన్‌తో పాటు పిల్లల పార్క్ నిర్మాణ పనులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



చెన్నాపురం అలుగు వద్ద మట్టిపోసిన కాంట్రాక్టర్

అలుగు నీరును దారి తప్పనివ్వం

గతంలో అలుగు నీరు ఎలా పోయిందో అదే విధంగా నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం. గతంలో పనులు ప్రారంభించగానే వర్షాలు పడటంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగింది. వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తాం. చెరువు అలుగునీరు గతంలో ఏ విధంగా వెళ్లిందో అదేవిధంగా నీటిని బయటకు వెళ్లేలా చూస్తాం.

– గోపాల్‌రావు, ఇరిగేషన్ ఈఈ

నేడు గిరిజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తెలంగాణ గిరిజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు గిరిజన సంప్రదాయ దుస్తుల్లో ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామసభలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు గిరిజనుల సంక్షేమం కోసం తండాలను గ్రామ పంచాయతీ హోదా, విద్య, ఉద్యోగ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లు, బంజారా భవనం, ఆదివాసీ భవనం ఏర్పాటును ప్రస్తావించాలన్నారు. కొమురంభీం, సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు అధికారికంగా నిర్వహిస్తున్న విషయాలను ప్రచారం చేయాలన్నారు. గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేయాలని సూచించారు. డాక్యుమెంటరీని కూడా ప్రదర్శించాలన్నారు. రాష్ట్రంలో అతిపెద్ద గిరిజన పండగైన సమ్మక్క- సారక్క జాతరను రాష్ట్ర జాతరగా నిర్వహించడం, పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించడం వంటి విషయాలను ప్రచారం చేయాలన్నారు. మేడ్చల్ మండలం సైదోనిగడ్డ తండా గ్రామ పంచాయతీలో మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొంటారన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా గిరిజన దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

ప్రజల కోసమే మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్



అన్నోజిగూడలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి మల్లారెడ్డి

పోచారం: స్థానికులు చిన్నపాటి ఫంక్షన్లు జరుపుకునేందుకు వీలుగా మున్సిపల్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించినట్లు కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం అన్నోజిగూడలోని ఎల్‌ఎన్ కాలనీలో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ చింతల రాజశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో తాను ఇచ్చిన హామీ మేరకు రూ.50 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేశామన్నారు. కాలనీకి ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రావడానికి చైర్మన్‌తో పాటు స్థానిక కౌన్సిలర్ ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో మంత్రి పాల్గొని ఉత్తమ సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, నర్రి ధనలక్ష్మి, సింగిరెడ్డి సాయిరెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్, నల్లవెల్లి లక్ష్మి, అబ్బవతిని సరిత, బద్దం మమతారాణి, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్ తదితర నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హరగోపాల్‌పై ఉపా చట్టాన్ని తొలగించాలి

వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఉపా చట్టాన్ని ప్రొ.హరగోపాల్ తదితరులపై తెలంగాణ ప్రభుత్వం బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హరగోపాల్‌పై బనాయించిన ఉపా చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకొని రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హరగోపాల్ ఉత్తమ అధ్యాపకుడిగా అందరి మన్ననలను పొందారని, విద్యాబోధనతో పాటు సామాజిక బాధ్యతను నెరవేర్చారన్నారు. ప్రజా ఉద్యమాలకు తనవంతు మద్దతును కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. గొప్ప వ్యక్తిపై ఎక్కడో ఎవరో డైరీలో పేర్లు ఉన్నాయనే పేరుతో ఉపా చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమైందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం అంటే ఉపా చట్టాన్ని ప్రయోగించడం కాదని, దాన్ని రద్దు చేయాలన్నారు. తెలంగాణ అవతరణ ఉత్సవాల సందర్భంగా ఉపా చట్టాన్ని ప్రయోగించినందుకు ప్రజలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని, దీనికి ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు.

ఉపా కేసు రద్దు చేయాలి

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా

రాష్ట్రంలో 152 మందిపై పెట్టిన చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) కేసులు రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హక్కులనేత ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు 151 మందిపై ఉపా కేసు నమోదు చేసినట్లు వెలుగులోకి రావడంపై శుక్రవారం ఆయన స్పందించారు. పలు ప్రజాసంఘాల నాయకులు, హక్కుల కార్యకర్తలు, ప్రొఫెసర్లు, మేధావులు, జర్నలిస్టులపై పోలీసులు ఉపా కేసు ప్రయోగించడం అప్రజాస్వామికం అన్నారు. సంబంధం లేని వారిపై కేసులు పెట్టడం వారి హక్కులను కాలరాయడమేనన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక 12 ఉపా కేసులు నమోదయ్యాయని, ప్రతి కేసులోనూ 50 నుంచి 120 మంది వరకు ప్రజాసంఘాల పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చారన్నారు. ఉపా కేసులన్నింటినీ రద్దు చేయాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కేసులను పెట్టడంలో కేంద్ర ప్రభుత్వంతో పోటీ పడుతోందని ఆయన విమర్శించారు.

ఎమ్మార్‌ఐటీఎస్‌లో అంతర్జాతీయ సదస్సు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఐటీఎస్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇంజినీరింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ టెక్నాలజీ ప్రోగ్రాంను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, ఓఎస్‌ఐఈటీ కార్యదర్శి ప్రభాకర్, వైద్య సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రారంభించారు. సదస్సుకు అంతర్జాతీయంగా పరిశోధన పత్రాలు వచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇలాంటి సదస్సులతో పరిజ్ఞానం మరింత పెంచుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్, డీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్

21వ వార్డులో కంటి వెలుగు ప్రారంభం



కంటి అద్దాలు అందజేస్తున్న కౌన్సిలర్ నారెడ్డి కృష్ణవేణి రవీందర్‌రెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 21వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ నారెడ్డి కృష్ణవేణి రవీందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. వార్డులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కంటి అద్దాలు, మందులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు బీఆర్‌ఎస్ నాయకులు పాండుగుప్తా, ప్రతాప్, కిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ వసతి గృహాల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వెల్ఫేర్ అధికారి సుధాకర్‌రెడ్డి కోరారు. మూడవ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఎస్సీ హాస్టల్‌లో 75, ఎస్టీలో 10, బీసీ 12, జనరల్ 03 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయపత్రం, ఆధార్ కార్డు, బోనోఫైడ్, టీసీ, రెండు ఫొటోలు, బ్యాంకు ఖాతా, పాసుబుక్ వంటి వివరాలతో హాస్టల్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం



మేడ్చల్ మున్సిపాలిటీలో చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్ మున్సిపాలిటీలో బోనమెత్తిన మున్సిపల్ చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మేడ్చల్ మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణమంతా పండగ వాతావరణంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మున్సిపల్ కార్యాలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించగా మంత్రి మల్లారెడ్డి పాల్గొని ప్రసంగించారు. బతుకమ్మలతో వచ్చి బోనాలను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి అమ్మవారికి సమర్పించారు. బతుకమ్మలతో ఆటలు ఆడి, పాటలు పాడి సంప్రదాయాన్ని ఉట్టి పడేలా ప్రదర్శనలు నిర్వహించారు. వివేకానంద విగ్రహం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి మంత్రి మల్లారెడ్డి, పట్టణ ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, డీఈ విజయలక్ష్మి, సిబ్బంది, అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా..

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని భవానీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా మంత్రి కేటీఆర్ మార్గనిర్దేశంలో మున్సిపల్‌శాఖ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం సఫాయి కార్మికులు, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, కౌన్సిలర్లను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్‌చైర్మన్ నరేందర్ రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరుల పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీలో..

మున్సిపల్ పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నాగారం మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రభాగంలో ఉంచామన్నారు. కమిషనర్ వాణిరెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు గూడురు సబితాఆంజనేయులు, అనితసుధాకర్‌రెడ్డి, మోకు రేణుక, లక్ష్మి, సుర్వీ శ్రీనివాస్, హరిబాబు, నాగేష్‌గౌడ్, లావణ్యశ్రీనివాస్, బిజ్జ శ్రీనివాస్, సుమిత్రసురేష్, కళావతి, సరిత, ప్రియంక, కోఆప్షన్ సభ్యులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అగ్రగామి మేడ్చల్ నియోజకవర్గం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీని చైర్ పర్సన్ పావనీయాదవ్, కౌన్సిల్ సహకారంతో అభివృద్ధి చేసిందని, మున్సిపాలిటీకి మూడోసారి స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ అవార్డు రావాలని మంత్రి మల్లారెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక నారాయణ గార్డెన్‌లో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మేడ్చల్‌కు నేనే ఎమ్మెల్యేను..

తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, మేడ్చల్ నియోజకవర్గానికి నేనే ఎమ్మెల్యేనని, అంత దమ్ము, తాకత్ ఎవరికీ లేదన్నారు. కేసీఆర్ అంటే ఒక భరోసా, బీఆర్‌ఎస్ అంటే ఒక నమ్మకం, విశ్వాసమన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాటలను నమ్మవద్దన్నారు. కబ్జాలకు, లంచగొండితనం, అరాచకాలకు కాంగ్రెస్ పెట్టింది పేరని, వారికి ఓటేస్తే మురికి కుంటలో వేసినట్లేనని ఎద్దేవా చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, రైతు బంధు సమితి నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే..

మేడ్చల్‌రూరల్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన మున్సిపాలిటీలను ఏర్పాటు చేసి వాటిని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్, మున్సిపల్ మంత్రి కేటీఆర్‌లకే దక్కుతుందని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, మున్సిపల్ ప్రజలు పాల్గొన్నారు.



దమ్మాయిగూడలో పట్టణ ప్రగతిలో చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



నాగారం మున్సిపాలిటీలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



ఘట్‌కేసర్ మున్సిపల్ అభివృద్ధి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి



గుండ్లపోచంపల్లిలో సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్